# మత్తు పదార్థాలతో అనర్థాలనేకం

- ఏసీపీ మురళీమోహన్
- మైలవరం సబ్ డివిజన్ పరిధిలోని మహిళా పోలీసులకు వర్క్‌షాప్


మైలవరం ఏసీపీ కార్యాలయంలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ మురళీమోహన్

మైలవరం: మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహప కల్పించాలని ఏసీపీ మురళీమోహన్ తెలిపారు. మైలవరం ఏసీపీ కార్యాలయంలో విజయవాడ సిటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజశేఖర్‌బాబు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా రూరల్ ఇన్‌చార్జి డీసీపీ హరి కృష్ణ సూచనల మేరకు మైలవరం సబ్ డివిజన్ ఏసీపీ ఎస్.మురళీమోహన్ అధ్యక్షతన శనివారం సబ్ డివిజన పరిధిలోని మహిళా పోలీసులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఏసీపీ మురళీమోహన్ మాట్లాడుతూ ఉమెన్స్ సేఫ్టీ, సైబర్ నేరాలు, డ్రగ్ అబ్యూజ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వాటిని గ్రామాలలో ప్రజలకు వివరించాలని సూచించారు. తద్వారా నేరాల నియంత్రణ ఏవిధంగా చేపట్టాలి అని వివరంగా విశ్లేషించి చర్చించారు. చిన్న పిల్లలకు సంబంధించి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై సవివరంగా తెలియజేస్తూ స్కూలు, అంగన్‌వాడీ, కాలనీలలో ఆయా పిల్లలకు ఏ విధంగా అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరాలపై వివరించాలన్నారు. యువత సెల్‌ఫోన్‌లలో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో యాడ్స్ చూసి అది నిజమేనని ఆ లింక్స్ క్లిక్ చేసి సైబర్ నేరగాళ్ల మోసాల బారిన పడకుండా జాగ్రత పడే విధంగా అవగాహన కల్పించాలన్నారు. యువత గంజాయి బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కిశోర్‌బాబు, కొత్తూరు, తిరువూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ అబ్దుల్ నబీ, సబ్ డివిజన్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

**మత్తు పదార్థాలతో జీవితం నాశనం**


మైలవరం ఎస్వీఆర్జీ ఎన్నార్ జూనియర్ కళాశాలలో మాట్లాడుతున్న లయన్ కోటిరెడ్డి

మైలవరం: యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ లయన్ ఏ.కోటిరెడ్డి తెలిపారు. మైలవరం ఎస్వీఆర్జీ ఎన్నార్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిదండ్రులు తమ బిడ్డలు బాగా చదువుకుని ప్రయోజకులు కావాలని కోరుకుంటారని, వారి ఆశలను పాడుచేయవద్దన్నారు. ఫిజికల్ ట్రైనర్ డాక్టర్ రమేష్ ప్రొజెక్టర్ ద్వారా మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే అనర్థాలను తెలియజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ జాస్తి వెంకటేశ్వరరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీధర్, కార్యదర్శి చనుమోలు నాగభూషణం, ట్రెజరర్ కొల్లిపర నాగప్రసాద్, లయన్ క్యాబినెట్ మెంబర్ సీహెచ్ బాలగోపాలరెడ్డి, కళాశాల ఏఓ కృష్ణకిశోర్, ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పత్తిలో అంతర పంటలు సాగు చేయండి

జిల్లా వనరుల కేంద్రం ఏడీ మనీషా


దాములూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ మనీషా, తదితరులు

దాములూరు (ఇబ్రహీంపట్నం): పత్తి సాగులో అంతర పంటలుగా పెసర, మినుము, కొర్రలు వంటివి సాగుచేయడం ద్వారా దోమల వృద్ధిని అరికట్టవచ్చని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు మనీషా తెలిపారు. మండలంలోని దాములూరు గ్రామంలో క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా పత్తి, మినుము పంటలు పరిశీలించారు. పత్తిలో రసంపీల్చే పచ్చదోమ ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. పచ్చదోమ ఆకు అడుగుభాగంలో చేరి రసం పీల్చడం వలన ఎర్రబారతాయన్నారు. పంట దిగుబడులపై తీవ్రప్రభావం చూపుతాయన్నారు. అంతర పంటలతో మిత్రపురుగులు వృద్ధిచెంది నష్టాన్ని నివారిస్తాయని తెలిపారు. పచ్చదోమ నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో డి.శైలజ, సర్పంచి మధుసూదనరావు, ఏఏవో నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

**సేంద్రియ కర్బనంతో మొక్కలకు పోషకాలు**


మైలవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

మైలవరం: భూమిలో సేంద్రియ కర్బనం పెంచడం ద్వారా మొక్క పోషకాలు గ్రహించగలుగుతుందని జిల్లా వనరుల కేంద్రం విజయవాడ ఏడీఏ పీ మోనీషా తెలిపారు. మైలవరం ఏడీఏ కార్యాలయంలో శనివారం రైతుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మోనీషా మాట్లాడుతూ పశువుల, వానపాముల ఎరువులు, జీలుగ, జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట విత్తనాలు వేయడం ద్వారా సేంద్రియ కర్బనం పెంచుకోవచ్చన్నారు. ఏడీఏ (ఆర్) శ్రీనివాసరావు మాట్లాడుతూ పత్తిలో గులాబీ రంగు పురుగు ఉధృతి తగ్గించుకోవడానికి సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. పురుగు మందులో వేపనూనె కలపడం వలన గుడ్లు పిల్ల పురుగులుగా మారకుండా నివారించవచ్చన్నారు. ఏఓ సంధ్యారాణి మాట్లాడుతూ వరిలో ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీ మీటర్ల కాలిబాట వేసుకోవడం వలన పైరుకు గాలి, వెలుతురు తగిలి చీడపీడలు ఉధృతి తగ్గుతుందన్నారు. వరి నాటే ముందు కొనలు తుంచి నాటడం వలన కాండం తొలిచే పురుగు, అకు ముడత పురుగు ప్రభావం తగ్గుతుందన్నారు. ముందుగా అధికారులు క్షేత్ర సందర్శన చేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ(టెక్నికల్) ఆర్.వాసుదేవ్ నాయక్, వీఏఏ ఎం.నాగరాజు నాయక్, ఎం. దివ్య పాల్గొన్నారు.

## ఆధార్ క్యాంపుల వద్ద అవస్థలు


రాజుపేట సచివాలయం ఎదుట బారులు తీరిన మహిళలు, వృద్ధులు

తిరువూరు: ఆధార్ నవీకరణ, సవరణల కోసం తిరువూరు పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పోస్టాఫీసులో, బ్యాంకుల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు కొన్ని మీసేవా కేంద్రాల్లో కూడా ఆధార్ సేవలందించేవారు. ప్రస్తుతం ఈ కేంద్రాలను రద్దు చేసిన ప్రభుత్వం సచివాలయాలు, స్కూళ్ల వద్ద తాత్కాలిక కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలు ఎక్కడ ఎప్పుడు ఏర్పాటు చేస్తారో అధికారులు తెలియజేయకపోవడంతో చదువుకునే పిల్లల ఆధార్ అప్‌డేట్ కోసం, వివిధ ప్రభుత్వ పథకాలకు, ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకోడానికి, ఆధార్ సవరణల కోసం పట్టణ ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. శనివారం రాజుపేటలోని ఒక సచివాలయం వద్ద నిర్వహించిన ఆధార్ కేంద్రానికి వచ్చిన మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు సరైన సౌకర్యాలు లేక చెట్లు, తుప్పల్లో క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చింది. ఒక పక్క వర్షం కురుస్తున్నా ఆధార్ కేంద్రం వద్ద పడిగాపులు పడుతూనే ఉన్నారు. ఇకనైనా శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## ఆర్జీయూకేటీకి వీసీని నియమించాలి

నూజివీడు ట్రిపుల్ ఐటీని సందర్శించిన ఏఐఎస్ఎఫ్ బృందం

నూజివీడు: రాష్ట్రంలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ)కి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వైస్ చాన్సలర్‌ను, నాలుగు ట్రిపుల్ ఐటీలకు డైరెక్టర్‌లను నియమించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లాలోని నూజివీడు ట్రిపుల్ ఐటీని ఏఐఎస్ఎఫ్ బృందం శనివారం సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో ఉన్న భోజన శాలలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైస్ చాన్సలర్, డైరెక్టర్లు తమ పదవులకు రాజీనామా చేసినందున విద్యార్థుల సమస్యలను పట్టించుకునేవారే కరువయ్యారని చెప్పారు. భోజనాలు సరిగా లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థులను దుర్భాషలాడుతున్న డీఎస్‌డబ్ల్యూవో సుబ్బలక్ష్మిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. క్యాంపస్‌లోకి మద్యం వంటి మత్తు పదార్థాలు రాకుండా నిఘాను మరింత పటిష్ఠం చేయాలని కోరారు. అనంతరం బృందం డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్‌ను కలిసి సమస్యలపై చర్చించారు. దీనికి సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ నూతన వైస్ చాన్సలర్ రాగానే అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని చెప్పారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్, బాలికల కోకన్వీనర్ చిన్నం ప్రీతి, కృష్ణాజిల్లా నాయకులు సాధిక్, సురేష్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



చిలుకూరువారిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో మొక్కలు నాటుతున్న ఎంఈఓ బాలు, తదితరులు


కాచవరం ఎంపీపీ పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంఈవో-2 రత్నశ్యామ్‌బాబు

చిలుకూరువారిగూడెం(మైలవరం): పర్యావరణ పరిరక్షణకు అమ్మ ప్రేరణ కావాలని, అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని ఎంఈవో ఎల్.బాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సూచనలు మేరకు పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, నేషనల్ గ్రీన్ కోర్ ఆదేశానుసారం మండలంలోని చిలుకూరువారిగూడెం శ్రీఅప్పిడి సుబ్బారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎకో క్లబ్ డే శనివారం నిర్వహించారు. పాఠశాలలో శనివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎకో క్లబ్ కన్వీనర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీ నారాయణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ అశోక్, ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ సుధాకర్ పాల్గొని విద్యార్థులతో మొక్కలు నాటించారు. చంద్రాల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. హెచ్‌ఎం వరదా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్కనాటి సంరక్షించాలని ఎంఈవో-2 రత్నశ్యాంబాబు తెలిపారు. శిక్ష సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా కాచవరం ఎంపీపీ పాఠశాలలో అమ్మ పేరుతో మొక్క నాటుదాం.. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పాఠశాల ఎకో క్లబ్‌లో వివిధ రకాల మొక్కలు నాటారు. హెచ్‌ఎం నాగమల్లేశ్వరి, ఇర్ఫాన్‌ఫాషా, డి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నం జెడ్పీ పాఠశాలల్లో హెచ్‌ఎంలు బి.పద్మలత, సంతోష్‌కుమార్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. చేతివృత్తి కళావిద్య ప్రదర్శించారు.

నూజివీడు: చెట్లు పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు భూతాపం పెరగకుండా దోహదపడతాయని గొల్లపల్లి హైస్కూల్ హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి పేర్కొన్నారు. గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో శనివారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్, బీజేపీ మండల అధ్యక్షుడు గోగినేని శ్రీనివాస కుమార అప్పారావు, పలగాని వెంకటేశ్వరరావు, యలర్తి నరసయ్య, బండి విజయరాణి, కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

మునుకుళ్ళ(తిరువూరురూరల్): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈవో శ్యామసుందరరావు సూచించారు. మండలంలోని మునుకుళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం శిక్షాసప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మొక్కలు నాటించారు. హెచ్‌ఎం బీ వీరభద్రరావు, పీఈటీ వేణి కృష్ణమ్మ పాల్గొన్నారు.

మునునూరు: మొక్కలను సంరక్షించుకుని పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తామని మునునూరు హైస్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రతిజ్ఞ చేశారు. శనివారం మునునూరు హైస్కూల్లో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లులచే మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు మాట్లాడుతూ మొక్కలను పెంచి ఆదర్శంగా నిలవాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### గానుగపాడును దత్తత తీసుకున్న ఉపాధ్యాయుడు

తిరువూరురూరల్: మండలంలోని గానుగపాడు గ్రామాన్ని తాను దత్తత తీసుకున్నట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు రాంప్రదీప్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో అక్షరాస్యతాభివృద్ధి, మూఢాచారాల నిర్మూలన తదితర కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. దాతల సహకారంతో గ్రామాభివృద్ధి, ఉన్నత పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసానికి తగు సహకారం, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత కెరీర్ గైడెన్స్ ఇవ్వడంతో పాటు మూఢ నమ్మకాలు పారదోలడం, వ్యాధులపై అవగాహన కల్పించడం లక్ష్యంగా తాను గానుగపాడును దత్తత తీసుకున్నానని రాంప్రదీప్ వెల్లడించారు.

### జాతీయ బీసీ చైతన్య సమితి జిల్లా అధ్యక్షుడిగా తేనె

తిరువూరురూరల్: జాతీయ బీసీ చైతన్య సమితి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఎర్రమాడుకు చెందిన తేనె నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఇటీవల బద్వేలులో జరిగిన కార్యక్రమంలో జాతీయ సమితి అధ్యక్షుడు రమణ చేతుల మీదుగా నాగేశ్వరరావు నియామక పత్రం అందుకున్నారు. వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని నాగేశ్వరరావు తెలిపారు.

## కొర్లమండ గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్‌ఓ


అనూష ఆరోగ్యపరిస్థితి తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ సుహాసిని

విస్సన్నపేట: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటంతో పాటు తాగే నీరు కాచి వడకట్టుకొని తాగాలని డీఎంఅండ్ హెచ్‌ఓ సుహాసిని అన్నారు. మండలంలోని కొర్లమండ గ్రామంలో గౌడబజారులో కొందరు విరోచనాలతో బాధ పడుతుండటంతో వైద్యారోగ్యసిబ్బంది అప్రమత్తమై గ్రామంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. మెడికల్ క్యాంపును శనివారం రాత్రి పరిశీలించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ విలేకర్లతో మాట్లాడారు. గ్రామంలో ఆరుగురు విరోచనాలతో బాధపడుతుండటంతో వైద్యసిబ్బంది మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి చికిత్స అందించారన్నారు. ఇద్దరిని తిరువూరు ఏరియా హాస్పటల్‌కు పంపామని, మిగతా నలుగుకి వైద్యం చేసి ఇంటికి పంపినట్లు డీఎంఎండ్‌హెచ్‌ఓ అన్నారు. గ్రామంలో మెడికల్ క్యాంపు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.విజయకుమారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అమృత, మండల వైద్యాధికారి కె.శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ ఝాన్సీరాణి, పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ, వీఆర్వో పాండు, వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నూజివీడు: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు శనివారం ఎంఈఓ-2 జమలయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు జీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీవో నంబరు 117ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, ప్రీప్రైమరీతో పాటు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒకే పాఠశాలగా నడపాలన్నారు. హైస్కూల్‌లో రెండు మీడియంలను సమాంతరంగా అమలు చేయాలన్నారు. మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, పాఠశాలలకు రావాల్సిన అన్ని రకాల గ్రాంట్లను మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లెల చెన్నారావు, పిళ్లా జోజప్ప తదితరులు పాల్గొన్నారు.

## దేశాభ్యున్నతికి అబ్దుల్ కలాం ఎనలేని కృషి


కొండపల్లిలో అబ్దుల్ కలాం చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతిని కొండపల్లిలో శనివారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మారాసు కృష్ణమోహన్, కొండపల్లి అధ్యక్షుడు చల్లా అంజనేయులు అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నిరుపేద కుటుంబంలో జన్మించి అత్యుత్తమ సైంటిస్ట్‌గా ఎదిగి, శాస్త్రసాంకేతిక రంగాల్లో తనదైన ముద్ర వేశారన్నారు. రాష్ట్రపతిగా దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో చిగురుపాటి లక్ష్మి, మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

## 150 మంది విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

మైలవరం: ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంఈవో పీవీ నరసింహారావు తెలిపారు. మైలవరం శ్రీలీలావతి గిరిజన పాఠశాలలో విజయవాడకు చెందిన ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్ సుంకర అక్కయ్యనాయుడు సౌజన్యంతో 150 మంది విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలను శనివారం పంపిణీ చేశారు. దాతల సహకారంతో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్య, స్వగ్రామం పై మమకారంతో సీఏ సుంకర అక్కయ్యనాయుడు చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సుంకర సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడతా లక్ష్మీనారాయణ, కార్యదర్శి జంజనం రాధాకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### కాచి చల్లార్చిన నీటిని తాగాలి

నూజివీడు: ప్రతి ఒక్కరూ డయేరియా బారిన పడకుండా కాచి చల్లార్చిన నీటిని తాగాలని నూజివీడు మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు అన్నారు. పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీలో శనివారం స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాలు వేడిగా ఉన్నప్పుడే తినాలని, పదార్థాలపై మూతలు ఉంచాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు, ఈగలు పెరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీరు కలుషితమవ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ ఉండాలి

మునునూరు: చిన్నారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షకీనా ఇవాంజిలిన్ సూచించారు. ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు అధ్యక్షతన మునునూరు హైస్కూల్లో విద్యార్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. డయేరియా, డెంగీ, మలేరియా వ్యాధుల వ్యాప్తి, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బాలలంతా మంచి ఆహారపు అలవాట్లతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. పౌష్టికాహారంతో విద్యార్థులను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### డెంగీ నివారణపై అవగాహన తప్పనిసరి

చాట్రాయి: డెంగీ నివారణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని పీహెచ్‌సీ వైద్యులు దుర్గా ప్రసాదు తెలిపారు. శనివారం చాట్రాయి గ్రామంలో విద్య, వైద్య శాఖల ఆధ్వర్యంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల న్నారు. ఎంఈవో బ్రహ్మాచారి, సీడీపీవో నూరాణి, చిత్తపూరులో సర్పంచ్ తిరువీధి రమేష్, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

### మహిళా చట్టాలపై అవగాహన తప్పనిసరి

ఆగిరిపల్లి: మహిళలు తప్పనిసరిగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ నూజివీడు ప్రాజెక్టు సీడీపీఓ నూరాణి అన్నారు. మిషన్ శక్తి 100 రోజుల అవగాహన సదస్సులో భాగంగా స్థానిక మసీదు సెంటర్లోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ముందడుగు వేయాలన్నారు. ఏసీడీపీఓ నాగేశ్వరి, సూపర్‌వైజర్ రాగమయి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### హెపటైటిస్ వ్యాధిపై అవగాహన

మూలపాడు(ఇబ్రహీంపట్నం): హెపటైటిస్ ఏ వ్యాధి అత్యంత ప్రాణాంతకమని కొండపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు ఆర్.పద్మావతి అన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా నిమ్రా ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో మూలపాడు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు వ్యాధిపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధితో ప్రాణాలు కోల్పోయేవారి సంఖ్య ఇటీవల కాలంలో పెరిగిందన్నారు. కరోనా తర్వాత అధిక మరణాలు టీబీ, హెపటైటిస్ వ్యాధుల ద్వారా సంభవించినట్లు పపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించిందన్నారు. వ్యాధికి కారణాలు, నివారణ మార్గాలు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు శిరీష, పర్వీన్, ప్రిన్సిపాల్ జనార్ధన్ పాల్గొన్నారు.

### సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ఏ.కొండూరు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ జమలమ్మ తెలిపారు. మండలంలోని కోడూరు, కేసీయా తండాలో శనివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రహదారికి ఇరువైపులా ఉన్న మురుగునీరు పారే విధంగా పూడిక తీత పనులు చేయిస్తున్నారు. వర్షపునీరు నిల్వ ఉన్న రహదారులపై బ్లీచింగ్ చల్లి దోమల మందును ఫాగింగ్ చేయిస్తున్నారు. తాగునీటిని క్లోరినేషన్ చేయించి ప్రజలకు సరఫరా చేయిస్తున్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నట్లు సర్పంచ్‌లు జరబల జమలమ్మ, టీ సురేష్ తెలిపారు.

### వైఎస్సార్ సీపీ నేత పీవీ రావు మృతి



చాట్రాయి: చనుబండ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాగడపూల వెంకటేశ్వరావు (94) శనివారం ఉదయం మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వెంకటేశ్వరావు బుర్రకథ కళాకారుడు (హాస్యపాత్ర). 1979లో ప్రముఖ బుర్రకథ కళాకారులు బెనర్జీ, నాజర్ బృందంతో ఢిల్లీలో ప్రదర్శన చేసి అప్పటి రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఏపీ కో ఆపరేటివ్ రాష్ట్ర యూనియన్ మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పరసా చెన్నారావు, వంకిణి వెంకటేశ్వరావు సంతాపం తెలిపారు.

### దోమల నిర్మూలనకు చర్యలు

తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం దోమల నిర్మూలనకు అధికారులు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. చిట్టేల, కాకర్ల, ఆంజనేయపురం గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచుల పర్యవేక్షణలో ఎబేట్ మందు పిచికారీ చేశారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి బాబు వలీ పర్యవేక్షణలో జ్వరాలు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. చిట్టేల సర్పంచి తుమ్మలపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### పురాతన నాణేల ప్రదర్శన



లక్ష్మీపురం(తిరువూరురూరల్): వివిధ దేశాల నాణేలు, కరెన్సీపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి మండలంలోని లక్ష్మీపురం ఎంపీయూపీ పాఠశాలలో శనివారం పురాతన నాణేల ప్రదర్శన ఏర్పాటు చేశారు. అమెరికా, నేపాల్, శ్రీలంక, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, థాయ్‌లాండ్, మలేషియా, యూరోపియన్ దేశాలలో అమలులో ఉన్న కరెన్సీని ఈ ప్రదర్శనలో ఉంచారు. గతంలో భారత్‌లో అమలులో ఉన్న అణా, పైసా, రూపాయి నాణేలను గురించి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు ఎం. హరికృష్ణ, ఉపాధ్యాయులు సుజాతాకుమారి, పద్మలత, బాబు తదితరులు అవగాహన కల్పించారు.

### ఆక్రమణల తొలగింపు



తిరువూరు: పట్టణంలోని ఫ్యాక్టరీ సెంటర్‌లో రహదారులు, డ్రెయినేజీలు ఆక్రమించి నిర్వహిస్తున్న దుకాణాలను నగర పంచాయతీ అధికారులు శనివారం తొలగించారు. మధిర రోడ్డు మలుపులో ఆక్రమణల కారణంగా మురుగు, వర్షపునీరు పోయే వీలు లేక రహదారిపై నిలిచిపోతున్నాయని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగర పంచాయతీ కమిషనర్ ఆక్రమణదారులకు గతంలో నోటీసులు జారీచేశారు. అయినా వాటిని తొలగించకపోవడంతో ప్రొక్లెయిన్‌తో ఆక్రమణలను తొలగించారు.